# మాతృవందనం

"డాక్టరు గారు వచ్చారు" అని శిష్యుడు నెమ్మదిగా స్వాముల వారితో చెప్పాడు.

స్వాములవారు తన వంక చిరునవ్వుగా చూడగానే, డాక్టరుగారు నమస్కారం చేస్తూ "నన్ను రమ్మని కబురు చేశారుట దేనికి?" అని అడిగాడు.

"శరీరే జర్జరీ భూతే, వ్యాధి గ్రస్తే కళేబరే.
ఔషధం జాహ్నవీ తోయం. వైద్యో నారాయణో హరిః"

- అంటూ స్వాములవారు మందహాసం చేశారు.

డాక్టరుగారు చేయవలసిన పరీక్షలన్నీ చేశారు.

"పూర్తిగా ఆరోగ్యంగా ఉన్నారు. క్రిందటి వారం కంటే చురుకుగా ఉన్నారు. అంతా సవ్యంగానే వుంది" అని అన్నాడు.

"నిజంగానే యీ శరీరంలో మీకు ఏ వ్యాధి కనిపించడం లేదా?"

"లేదు!"

స్వామి వారు ఒక్క క్షణం ఏమీ మాట్టాడలేదు. మనస్సు మూగబోయింది. చూపు అనంతాన్ని దాటి దూరంగా చూస్తోంది.

"మీ పరికరాలకి అంతు చిక్కని మహా వ్యాధి నన్ను పీడిస్తోంది" అంటూ నిట్టుర్పుగా - నిరాశగా అన్నాడు.

డాక్టరుగారు అంజలి ఘటియించి -

"మీరు సర్వజ్ఞులు - అన్నీ తెలిసిన వారు. వ్యాధి పేరు, దాని లక్షణాలు చెబితే మీరు ఆజ్ఞాపించిన రీతిగా చికిత్స చేస్తాను. ఆజ్ఞాపించండి!"

స్వాములవారు. చిలిపిగా చూస్తూ, "ఇది మందు లేని వ్యాధి - దీనికి మరణమే శరణము".

ఆ గదిలో-పిడుగు పడ్డంత నిశ్శబ్దం. డాక్టరు స్థాణువులాగా నిలబడి పోయాడు.

శిష్యుడు - "శివ శివా!" అని చెవులు మూసుకున్నాడు.

"ఖంగారు పడకు. యింకా శివుడి ఆజ్ఞ కాలేదులే!" అని స్వాముల వారు శిష్యుడుని సముదాయిస్తూ వుంటే - డాక్టరు గారు, "మందులేని వ్యాధి అని సెలవిచ్చారు.ఆ వ్యాధి పేరేమిటో తెలుసుకోవాలని ఉంది!"

"వ్యాధి పేరు నాకు తెలియదు. కాని అది వ్యాధి అని తెలుసు"

"వ్యాధి లక్షణం?"

"సర్వసంగ పరిత్యాగియైన యతి మనస్సులో తీవ్రమైన కోరికలు మళ్ళీ తల ఎత్తడం! అదే యీ వ్యాధి లక్షణం! భయంకరమైన వ్యాధి కాదా?"

"కోరిక మంచిది. ఆచరణ యోగ్యమైనది- మోక్షసాధనకు అనువైనది అయిన, అది, వ్యాధి కాదు- మానవ సహజమైన లక్షణం" అని డాక్టరుగారు అంటూంటే- స్వాములవారు నవ్వి -

"మీరు కూడా మా దోవలోకి వస్తున్నారు-"

"సజ్జన సాంగత్య సత్ఫలితము. మీకు కలిగిన కోరిక ఏమిటో తెలుసుకోవచ్చా?"

"అమ్మని చూడాలని కోరిక కలిగింది - ఆమె పాదాల మీద శిరస్సు ఉంచి నమస్కరించాలని ఉంది - ఆమె చల్లని వడిలో చింతలన్ని మరచి పోవాలని ఉంది."

"ఈ రోజు ఎన్నో క్రొత్త విషయాలు వింటున్నాను - సర్వసంగ పరిత్యాగులకు కూడా కోరికలు ఉంటాయి. చింతలు ఉంటాయి - సన్యాసులకు - స్వాములవారికి కూడా సామాన్య మానవులకి ఉండే యీతి బాధలు వుంటాయన్న మాట"అని డాక్టరు గారు అంటూ వుంటే -

స్వాములవారు నవ్వి - "నరుడి బాధలు నారాయణునికే అర్థమవుతుంది.... రేపటి నుంచే యీ రుగ్మతకు చికిత్స మీరు ప్రారంభిస్తున్నారు?"

"చికిత్స రోగికి కాని ఆరోగ్య వంతులకి కాదుగా".

"నేను రోగినే. మాయాజాలంలో చిక్కుకున్న వాడిని..../మోహం వీడలేని వాడిని".

"మీరు ఏవేవో ఊహించుకుని అకారణంగా ఆందోళన చెందుతున్నారు. యీ రోజు పూర్తిగా విశ్రాంతి తీసుకోండి. నిద్దర పట్టడానికి - మందు ఇవ్వనా?......

"మందు వేసుకున్నా - నెమ్మది లేని మనస్సుకు నిదురు రాదు.... నన్ను యీనాడు జాగృతిలోనే ఉండనివ్వండి. సుషుప్తి నాకు వద్దు. కాని రేపు మాత్రం మీరు నా వెంట రావాలి. మీ సహాయం నాకు కావాలి"

"ఎటువంటి సహాయం"

"మనస్సు వేసిన బొమ్మని మనస్సు చేతనే చెరిపి వేయించడానికి"

"అది సాధ్యమా?"

"సంసారులకి కాకపోవచ్చు. సన్యాసులకు సాధ్యమే డాక్టరు గారు. మనం రేపు బయలు దేరుతున్నాము".

డాక్టరు తన చేతిలోని మందు సీసాని బల్ల మీద పెడుతూ -

"అవసరమైతే యీ మందు వాడండి - మంచి నిద్దుర, మనస్సులోని చాలా బొమ్మలని చెరిపి వేస్తుంది" అంటూ స్వాములవారికి నమస్కారం చేసి - అక్కడ నుంచి వెళ్ళిపోయాడు.

అన్ని రోజుల లాగానే - ఆ రోజు కూడా - రేయి గడిచి పగలు వచ్చింది.

మరునాడు యధా సమయానికి డాక్టరు గారు వచ్చారు. రాగానే ఆయన అడిగిన చిన్న ప్రశ్న - "ప్రయాణం ఉందా?"

"ఉంది!"

"మన గమ్యం?"

"భారత దేశానికి, ఋషులు - వేదాలు పుట్టిన దేశానికి - నిత్యం వెలుగు నిండిన దేశం".

"కొద్ది క్షణాలలో మనం బొంబాయి చేరుతున్నాం. భారత దేశంలో ప్రవేశిస్తున్నాము" అని పైలట్ చెబుతున్న మాటలు వినగానే స్వామి వారి మనస్సు పరం నుంచి ఇహానికి వచ్చింది.

భారతదేశం!!!

"సుజలాం, సుఫలాం. మలయజ శీతలాం
సస్య శ్యామలాం మాతరం వందేమాతరం!"

-అంటూ స్వాములవారు అంటూంటే ప్రక్కనున్న డాక్టరు గారు చిరునవ్వు నవ్వి "అది ఆనాటి మాట" అని అన్నాడు.

యాభై వసంతాల తరువాత - మాతృ దేశపు గడ్డపై పాదం మోపిన ఆ జీవి ఆనందంగా నలుదిక్కులా చూశాడు. బొంబాయి విమానాశ్రంలోని గందరగోళం చూశాడు. క్షణక్షణం జరుగుతున్న మోసం. మనస్సుకు చివుక్కుమనిపించింది. ఛీ! ఛీ! ఈ నరుల దేమి జీవనము-

చికాకుతోనే - చిన్న మోయిన మనసు'తోనే, అడుగు ముందుకు సాగింది.

"ఎక్కడికి?" అని డాక్టరు గారు ప్రశ్నించారు.

"నా జన్మ స్థలానికి... నేను ఏ గ్రామంలో జన్మించానో తెలియదు. తల్లి తండ్రులెవరో యీ నాటికి తెలియదు - కుంతి పుత్రుడినో - కన్యాకుమారుడినో నాకు తెలియదు. తెలిసినదల్లా - ఉమా మహేశ్వర ఆలయం - సింహద్వారం దగ్గర - పసిబిడ్డగా బిడ్డలు లేని ఒక యిల్లాలుకు దొరికానని...." నన్ను తీర్చి దిద్దింది ఆ మహా యిల్లాలే... నాకు తెలిసిన తల్లి! ఆవిడే - అనర్ఘ నామధేయురాలు- 'లలితాంబ!' - ఆవిడే, సాక్షాత్తు శ్రీ మాతా శ్రీ మహారాజ్ఞి శ్రీమత్ సింహాసనేశ్వరీ! మనం ఆ వూరు వెడుతున్నాము. ఆ ఆలయం చూద్దాము. నేను పెరిగిన యింటికి వెడదాము".

ఆ వూరు వెళ్ళారు - అపశకునం ఎదురైయింది. నగరంలో బంద్. కారణం - ఆస్తి విషయంలో తండ్రికి కుమారుడికి తగాదా వస్తే కుమారుడు తండ్రిని హత్య చేసి పట్టుపట్టాడట. అతనికి కోర్టువారు విధించిన మరణ శిక్షకు నిరశనగా యీనాడు బంద్!

స్వాములవారి మనస్సులో మసలిన మాట "ఎక్కడి మానుష జన్మం బెత్తిన ఫలమేమున్నది."

ఆలయానికి చేరుకున్నారు. ఆలయం తలుపులు మూసుకున్నాయి. సాయుధ బలాల కాపలా. కారణం - ధర్మకర్తలను నిర్ణయించడం గురించి భక్తులు మధ్య వచ్చిన తగాదా - చిలికి చిలికి గాలి వానయై కోర్టువారి తీర్పు వచ్చేవరకు - ఆలయంలోని దైవానికి - పూజలు లేవు, ధూప దీప నైవేద్యాలు వాయిదా పడ్డాయి...... మనిషిని నమ్ముకున్న దేముడు-పస్తులుంటున్నాడు.

డాక్టరుగారికి చాలా బాధ కలిగింది.

"దైవాన్ని ఎంత చులకన చేస్తున్నారు! ఈ మానవులకు విజ్ఞానం - వివేకం ఎప్పుడు కలుగుతాయి?" అని ఆక్రోశించాడు.

"కృత యుగంలో!" అని స్వాముల వారు సముదాయించారు.

ఇద్దరు నడిచి - నడిచి - ఒక పెద్ద భవంతి ముందు ఆగారు. "ఇది ఎవరి యిల్లు?' ' అని డాక్టరుగారు మౌనంగా ప్రశించాడు.

"నాకు మహోపకారం చేసిన వ్యక్తిది. లలితాంబగారి మేనకోడలు యిల్లు. నేను ఎవరినో - నేను తెలుసుకునేందుకు సహకరించిన వ్యక్తి".

"ఎలా?"

"నాకు యీ పిల్లను - కామాక్షిని యిచ్చి చేసుకుని-యీ ఆస్తి అంతా మాకు యివ్వాలని లలితాంబ గారికి ఉండేది. ఎవరి సంతానమో - కులం గోత్రం తెలియని సన్యాసిని కట్టుకోవలసిన కర్మ నాకు లేదు'- అని ఆ పిల్ల నిర్మొహమాటంగా చెప్పింది. అంతే కాదు తన మేనత్త ఆస్తికి వారసురాలు తనేనని యీ దారిని పోయే దానయ్య కాదని - కుండ బ్రద్దలు కొట్టినట్టు చెప్పింది - ఆమె మాటలలోని నిజం - దానితో బాటు ఒక నిర్ణయం కూడా వచ్చింది. సంసారి కాలేని వాడికి - ముక్తి మార్గం - సన్యాసమే.... కాని యీ సన్యాసమె - కర్మ భూమి నుంచి - నన్ను భోగ భూమికి తీసుకుపోయింది".

ఇద్దరు ఆ యింట్లోకి వెళ్ళారు - లక్ష్మీదేవి లాంటి పండు ముత్తైదువు కనిపించింది.

స్వాములవారు - ఆవిడకి నమస్కారం చేశారు.

"నేను...." అంటూ ఏదో చెప్పబోయారు. ఆవిడ నవ్వింది- "నువ్వు నాకు తెలుసు- నేను పెళ్ళి చేసుకోనన్నానని.... అలిగి - అర్ధాంతరంగా యింట్లోంచి పారిపోయిన వాడివి.....' ' ఆవిడ ఒక్క క్షణం ఆగి నెమ్మదిగా అడిగింది - "యీ సన్యాసానికి కారణం - ఆగ్రహమా? అభావమా? ఎవరిని ఉద్ధరించడానికి యీ కాషాయ అంబరం?"

స్వాములవారు సౌమ్యంగానే సమాధానం చెప్పారు.

స్వయం తైర్ణాః పరాం స్తార యంతి!"

ఆవిడ వెన్నెల విరిసినట్టు నవ్వింది- "మహారాణీలాగా బ్రతకమని నా గీతలో ఉంది. సన్యాసిలాగా బ్రతకమని - నీ కర్మలో ఉంది. అందుకనే మన వివాహం జరగలేదు'

"అంతా దైవ అనుగ్రహం" అని స్వాములవారు అంటూ లేచి నిలబడ్డారు.

భరత వాక్యంగా ఆవిడ అన్నమాట...."ఈ సారి మనదేశం వచ్చినప్పుడు మా యింట్లో భిక్ష చేస్తాను "

స్వాములవారు నమస్కారం చేస్తూ - "మహా ప్రసాదం" అని అన్నాడు.

స్వామీజి సంతోషంగా బయటకు వచ్చారు.

'కాలకూట విషాన్ని చూసి ఖంగారు పడకు అమృతాన్ని ఆస్వాదించుదాము- పద' అన్నారు.

విమానం హిమాలయాల మీదుగా ఎగురుతోంది. స్వర్గాన్ని మైమరిపించే అలౌకిక దృశ్యాలు....

"మీకు ఎడం వైపున కనిపించేదే కైలాస పర్వతం"- అని పైలట్ చెప్పగానే స్వామిజి ముకుళిత హస్తాలతో-

"హే చంద్ర చూడ మదనాంతక శూలపాణి!

స్థాణో గిరీశ, గిరిజేశ మహీశ శంభో!

అంటూ శివస్తోత్రం ప్రారంభించాడు"

"మనం యిప్పుడు అన్నపూర్ణ శిఖరం మీదుగా ప్రయాణం చేస్తున్నాము-"

స్వామిజీ మనస్సులో మసలిన మాట-

"చిద్రూపీ పరదేవతా భగవతీ శ్రీ రాజరాజేశ్వరి" అంటూ ఆ జగన్మాతకు నమస్కారం చేశారు.

బొంబాయి విమానాశ్రయం దగ్గర డాక్టరుగారు చిలిపిగా అడిగాడు - "బొమ్మలు చెరిగి పోయాయా?" అని

స్వాములవారి వదనంలో పసితనం కనిపించింది. పరమానందం వెల్లివిరిసింది.- హృదయం లోంచి, భగవద్గీతలో పాండవ మధ్యముడు చెప్పిన శ్లోకం వచ్చింది.

"నష్టో మోహః స్మృతిరణబ్దా త్వత్ప్రసాదాన్మయా చ్యుత
స్థితోస్మి గత సందేహః కరిష్యే వచనం తవ....."

మాయ వేసిన సంకెళ్లు తొలగిపోయాయి. తేలికబడ్డ మనస్సుతో విమానం అమెరికాకు బయలుదేరింది. విషాదయోగం అదృశ్యమయింది. జ్ఞానయోగం ప్రారంభమైంది.

## కల్పన

"**మి**మ్మల్ని మహంతుగారు రమ్మంటున్నారు" అని వెంకటాచలానికి గురువారం ఉదయం కబురు వచ్చింది.

ఆ వూరు పేరు మధుర కాక పోయినా ఆ వూళ్ళోని మీనాక్షి సుందరేశుల ఆలయంమహా ఆకర్షణీయంగా ఉంటుంది. అమ్మవారి సంగతి చెప్పనే అక్కర్లేదు. భక్తుల మనస్సు గ్రహించి అడగ కుండానే వరాలు ఇచ్చిదీవించే చల్లని తల్లి.

ఏనాడు ఎవరి రూపకల్పనో - ఎవరి తపోఫలమో ఆ తల్లి యీ వాడలో అవతరించి దశాబ్దాలు కాదు - శతాబ్దాలే గడిచాయని చరిత్ర చెబుతోంది. చెప్పలేనిదల్లా ఆలయాన్ని నిర్మించి, మానవ జాతికి కానుకగా యిచ్చి తాము మాత్రం అజ్ఞాతంగా అనామకంగా నిలిచి పోయిన వారిని గురించి.

ధర్మకర్తలు ఉన్నారు. కాని వంశపారంపర్య ధర్మకర్తలు ఎవరూ లేరు. యీ ఆలయం ధర్మకర్తగా పదవి లభించిందంటే అతగాడి పంట పండిందన్న మాటే ! అన్యాయం, అవినీతి అడుగుపెట్టనంత కాలం, సవ్యంగా విధి నిర్వహించినంత కాలం బ్రతుకు మూడు పువ్వులు ఆరు కాయలు. పాపపు తలంపు మనస్సులో మసలిందా అంతే ! అంతటితో ఆ పద్దు రద్దు.

దిగంబర ఈశ్వరుడి ఇల్లాలైనా ఆ మహాతల్లి పర్వత రాజపుత్రుడి హిమవంతుడి ముద్దు బిడ్డ. అందుకనే సర్వాభరణ భూషిత సర్వఐశ్వర్య సమన్విత భక్తజనసులభ కావడం వల్ల కోరికలు తీరిన భక్తులు కృతజ్ఞతతో సమర్పించిన కానుకలు, ఆభరణాలతో ఆ దివ్యమూర్తి సిరిసంపదలతో ఏడుకొండల స్వామికి సమాన ఫాయాలోకి ఏనాడో చేరుకుంది.

పెట్టిన నగ పెట్టకుండా రోజుకొక నగ చొప్పున ఆవిడ అలంకరించుకుంటే మళ్ళీ రెండు సంవత్సరాలకు కాని యీ నగ మళ్ళీ ధరించడానికి అవకాశం రాదని జనవాక్యం.